**పెద్దమ్మి అనుసూయా! సినపాప అలిమేలూ! ఒరే నాయినా, సత్తిబాబూ! మీరు బాగుండారా? ఎర్రిబాగులోడు మీ నాయినెట్టా ఉండాడు? ఎట్టుండారో, ఏమైనారో అతీ గతీ తెలియకుండా పోయెగదమ్మా! నే నేం జేతు? అయినా ఇవ్వు దనుకోని, ఇంకొంచేవటికి బయల్దేరి రావడమేమన్నానా! రెండు మూడేండ్ల ఎవ్వారమైపోయె గదా! అయినా సరే, నే నిట్టా రాకనేపోదును. ఇరాక్కు ఇరానుకు యెల్లొచ్చినోళ్లు, దుబాయికీ కువైట్టుకు యెల్లొచ్చినోళ్లు సెవిలో ఇల్లుగట్టుకోని పోరిరి గదమ్మా!**

# గల్ఫ్ సందేశం

**మధురాంతకం రాజారాం**

"కూలీ నాలీ చేస్తే వచ్చేది గొర్రెతోక సంపాదనే గదా! దాంతో మీ రెట్టా మిగిలి మిట్టనవడతా రే అమ్మీ? బిడ్డలు పెరిగే వయసు కదా! వాళ్లకు కడుపునిండా తిండిపెట్టొద్దా? కట్టుకోను నాలుగు జతల బట్ట లుండొద్దా? వానొస్తే పందిరి మాదిరిగా నీళ్లు జల్లించే ఈ పూరింటిని కొంచెం గట్టిగా వానకూ, గాలికీ నిలిచేటట్టుగా కట్టుకోవద్దా? ఇంక నాలుగేండ్లు పోతే పెద్దమ్మి అనసూయకు పెండ్లి సెయ్యొద్దా? మా మాట సెవిలో యేసుకోని ఒకసారి గల్ఫుకు పోయిరాయే పిచ్చిదానా! అడ రాజా సంపాదన గదా! నువ్వు వూ( అను సాలు. బొంబాయికి తీసుకపోయి గల్ఫుకు పంపించే ఏర్పాట్లన్నీ చేసేవోళ్లు ఇప్పుడు వూరి కొకరుండారు. దేనికైనా తెంపు సెయ్యాల్నే ఎర్రిమొగమా! పులిచెర్లలో మీ పెద్దమ్మ కొడుకు సౌదీ పోయినాడని సెప్తివి గదా! నువ్వున్నూ సౌదీకే ఎళ్లు. పొయ్యేటప్పుడు పకీర్లుగా పోయినోళ్లు వచ్చేటప్పుడు నవాబులుగా తిరిగొస్తారు తెల్సునా?' అంటా ఎచ్చబెట్టిరి. అందుకు దోడు నెల కొకర్నో ఇద్దర్నో బొంబాయికి రైలెక్కించే బంగారుపాలెం పెదబ్బనాయు డొకడు పోతావా, చస్తావా అని నా పీకల మీద కూచుండిపోయె.

'నీ మాటేమి? పోయి రమ్మంటావా? దయిర్నంగా ఒక సెప్పు' అని నొక్కి నొక్కి అడిగితే మీ నాయిన గూడా, నా కర్మకొద్దీ 'ఏమో నీ ఇష్ట'మనినట్టుగా తల వేలాడేశా. పోటోలని, పానుపోర్టులనీ, వీసాలనీ, ఇంకా అదనీ ఇదనీ, కడకు అదంతా నే న్జూచుకుంటాలెమ్మని పెదబ్బనాయుడు బయల్దేరదీశా. అమ్మి ఎందో మోయరాని ముల్లె మోనుకొస్తుందని మీరున్నూ కిమ్మక్కుమనకుండా ఉండిపోతిరి. 'నువ్వొకతివే కాదులే, నీతో గూడా కొత్తపేట నుంచి రాయపాటి తులనమ్మ గూడా వొస్తా'దని పెదబ్బనాయు డంటే, 'ఇంకేమిలే, దారి తోడు దొరికింద'ని నేనూ సమాధానవడిపోతిని. రేణిగుంటదాకా వచ్చి మీ నాయన రైలెక్కించె. రైలు కదిలి మీ నాయిన కనుమరుగయ్యేటప్పటికి మడుగులో గుండు పడినట్టుగా మనసంతా విలవిల్లాడిపోయ. ఇంకెప్పుడు రేణిగుంట టేషన్లో దిగబోతామో, ఎప్పుడు తిరపతిలో బస్సెక్కి మన ఊరికి పోబోతామో, ఎప్పుడు మళ్లా బిడ్డల మొఖం చూడబోతామోనని కుంపటిలో పొట్టేసి కుమ్మి పెట్టినట్టుగా, గుండెల్లో నుంచి ఏడుపు ఎగదన్నుకొచ్చె. 'అప్పుడే కన్నీళ్లు పెట్టుకుంటే ఎట్టనే నాగమనీ! నాలుగు రాళ్లు ఎనకేసుకోవాలంటే, పదిమందిలో పేరుగా బతకాలంటే మనను రాయి చేసుకోవాల' అని తులనమ్మ సరిది చెప్పింది.

రైల్లో నేమో మన మన్సులూ కనిపిస్తా వుండ్రి, మన మాటలూ వినిపిస్తా వుండె. తీరా బొంబాయి టేషన్లో దిగేటప్పటికి నేల యీనినట్టుగా ఒకటే జనం. పెదబ్బనాయుడు ముందుగా నడస్తా ఉంటే, నేను, తులనమ్మా ఒకరి చేతు లొకరు పట్టుకొంటిమి. వాళ్లెవురో ఏజంట్లంటమ్మా - సూటూ, కోటూ యేసుకోని ఒక్కొక్కడూ అంతెత్తున దండుకుపోయొచ్చిన సిపాయిల మాదిరుండారు. వా ళ్లెదురుంగా వొచ్చి పెదబ్బను పలకరించిరి. మమ్మల్ని ఎగాదిగా జూచిరి. టేషను బయట ఒక మూడు చెక్రాల బండిలో కూచోబెట్టిరి. ఆ రోడ్లపైన ఇన్ని అన్ని బండ్లు కాదు, ఇందరూ అందరు మన్సులు కారు, వాళ్లందురూ యాడికి పోతారో, ఏం పని చేస్తారో, ఏమి తిని బతకతారో అంతా నా కయోమయంగా ఉండిపోయ. మమ్మ లెక్కించుకున్న బండేమో, రోడ్లు దాటి, ఈదులు దాటి, సందుల్లో గొందుల్లో తిరిగి తిరిగీ ఆఖరు కొక చోట నిలిచిపోయ. చూసేదానికి చిన్న ఇల్లు మాదిరుండే గానీ, లోపలికి పోతే పోయినంతదూరమూ ఇల్లే. అక్క డొకచోట మాకు తోడుగా ఇంకొక నలుగురాడోళ్లు కనిపించిరి. అందులో ఇద్దురేమో అరవం మాటాడేవోళ్లు.

ఒకామెది మైసూరు. ఇంకొకామె అన్ని బాసలూ కొంచెం కొంచెం మాటాడుతుంది. తురకాణంలోనైతే ఏజంట్లనైనా అదరగొట్టేస్తుంది. మళ్లీ తెలిసింది - ఏమంటే ఈ నాలుగో ఆమె - ఆమె నందురూ సుల్తానా అని పిలస్తారు. ఆమె మే మా ఇంట్లో అడుగు పెట్టినప్పటినుంచి, మమ్మల్ని ఎక్కడికి చేర్పించాల్నో అక్కడిదాకా మాతోనే ఉంటుందంట! చూడగా సూడగా ఆమె గూడా ఒక ఆడ ఏజంటనే అనిపించింది. ఆమె మాట కక్కడ తిరుగు లేదని గూడా తెలిసింది.

ఇక మీదట మీరు చీర మాట, జాకెట్టు మాట ఎత్తగూడదు - అనింది. తొడుక్కునే దానికి పొడుగ్గా ఒక షరాయి, దానిపైన ఏసుకోను మోకాళ్లకిందకి జారే జుబ్బా ఇచ్చి, పైటకు బదులు సన్నటి పేలిక ఒకటి వలెవాటుగా ఏసుకోమనింది. 'రోజుకు రెండుసార్లు స్తానం చెయ్యండి. సోపు బాగా అరగరుద్దండి. ఎనకాడకుండా గొంతుదాకా తిండి దట్టించండి. చూస్తే కండ్లకు సదురుగా వుండాల. ఈసురోమంటా, ఈలకరచుకోనుంటే ఎట్ల? మీరు పోయే దేశంలో మన్సు లెట్టా ఉంటారో తెల్సునా? గిచ్చితే నెత్తురొచ్చేటట్టు పెద్దపెద్ద రబ్బరు దిమ్మలమాదిరుంటారు. ఆ సంగతి మనసులో పెట్టుకోండి. డాక్టర్లొస్తారు. పరీచ్చలు చేస్తారు. పోటోలు తీసేవాళ్లొస్తారు. పోటోలు తీస్తారు. ఇంకా ఎన్నో పన్లుంటాయి. అదంతా మీ కెందుకు? ఈడ వంటా, వార్పూ నేర్చుకునే దేమి పని. నేర్పించేదానికే నే నుండేది. మీరు తినే అన్నాలూ, పులుసులూ, పచ్చళ్లూ అదంతా అడ ధం డలాయించగూడదు. పులావు, కట్లెట్లు, ఆమ్లెట్లు, ఫ్రైలు, కుర్మాలు, చపాతీ, పూరీ, చికెన్ రోస్టు, ఎగ్ బిర్యానీ ఇంకా ఇటువంటి వెన్నో ఉండాయి. నాలుగు రోజులు నేను చేసి చూపిస్తా. మళ్లా రోజు కొక్కక్కటి మీరే సెయ్యాల' అని వంటింట్లోకి నడిపించింది.

నేర్చుకొనేదీ, చేసేదీ, తినేదీ అంతవరుకు బాగానే ఉంది. మునల్ల పండగంతా ముందుండాదని మా కేం తెలును? రేయీ పగలూ గూడా దీపాలు మండే ఆ చీకటి సొరంగంలో ఎంతకాల ముంటిమో తెలీదు. ఆఖరు కొకనాడు 'మొన్నాటికే ప్రయాణం, సిద్ధంగా ఉండండి' అనిరి. ఆ రోజు గూడా రానే వచ్చె. ఇంకాసేపటికి ప్రయాణమనగా, 'ఇదుగో - ఇది మీరేసుకోవా'లంటా నల్లటి బురఖా పైకి తీసిరి. కండ్లు కనిపించేటట్టు రెండు బొరికలు, గాలి ఆడేటట్టుగా ముక్కు కింద ఇంకొకటి - భూతకొరాలాయకట్టుగా ఆ ముసుగులు తొడుక్కునేటప్పటికి మాకు ఏడుపొచ్చేసింది. ఇంతకన్నా ఈదుల్లో అడుక్కుతిన్నా మేలే ననిపించింది. మా ఏడుపు మేము దిగమింగుకుంటా ఉంటే సుల్తానా బూబు ఏమనిందో తెలునునా?

దేశానికంతా పెద్దగా ఢిల్లీలో పెసిడెంటని ఒకాయ నుండాడంట. ఒకసారి గల్ఫు కెళ్లినప్పుడు




ఆయన భార్య మునుగేనుకోకపోయినందువల్ల యిమానంలోనే ఉండిపోయిందంట. ఎంతటోల్లకైనా అక్కడిది తప్పదని గదమాయించింది.

నరే, ఈ మునుగులో నేను కల్లూరు నుంచొచ్చిన నాగమని మాదిరిగా లేను. నా వక్కనుండే ఆమె కల్లూరి నుంచొచ్చిన రాయపాటి తులనమ్మ మాదిరిగా లేదు. మే మెవరమో ఏమో మాకే తెలియకుండా పోయినాక ఇంక ఏడుపెందుకని గమ్మ నుండిపోతిమి. టాక్సీ కారులో మమ్మల్ని ఏరుపోర్టుకు తోలిరి. ఏరుపోర్టంటే ఇమానా లొచ్చి వాలే చోటు. చిన్నదీ చితకదేం గాదు. మన ఊరు ఊరంతా చేరినా అందులో ఒక మూలకు నరిపోదు. ఎన్ని గేట్లో, ఎన్ని అద్దాలో, ఎన్ని గేదాలో! అన్నీ తెలిసిన నుల్తానా బూబమ్మ ఉండేవట్టి నరిపోయింది గానీ, లేకుంటే మేము బోనులో ఎలుకల మాదిరిగా చిక్కి బిక్కరించి ఉందుము. ఇమానం నంగతీ అంతే! నే నింకా అది ఒక చిన్న ఊరికొట్టమంత ఉంటాదనుకుంటిని. అమ్మో! శానా పెద్దది. వరన కారుమంది లెక్కన చూసినంత దూరం మన్నులే! మమ్మల్ని మా తావులో కూచోబెట్టిరి.

నాకయితే గుండె డబడబ్బని కొట్టుకుంటా ఉంది. అందుకు దగినట్టు ఇమానంలో కూచున్నోళ్లు ఒకరితో ఒకరు మాటాడుకోరు. ఒకరి ముఖం ఒకరు చూనుకోరు. వగోళ్ల మాదిరిగా మూతులు బిగించుకో నుండారు. ఉన్నట్టుండి - 'చూడు నూడు. ఎగరతా ఉంది, ఎగరతా వుంది' అని తులనమ్మ నా సెవిలో గునగునలాడింది. 'బెల్టులు తగిలించుకుంటిరా లేదా' అని నుల్తానా పైకి లేచింది. మాకు తెలీకపోతే తానే తగిలించింది. కిటికీలో నుంచి మబ్బులు వరుగెత్తడమైతే కనిపిస్తాది గానీ, ఇమానం కదిలేది కనిపించదే! రెండు గడియల్లో టిపిను

పొట్లా లిచ్చిరి. రాత్రంతా సరిగ్గా నిద్ర లేదేమో, టిపిను తినేటప్పటికి చల్లటి ఇమానంలో ఒళ్లు తెలియకుండా నిద్రొచ్చేసింది. ఎంతసేపు నిద్రపోతినో! ఉన్నట్టుండి వులికిపడినట్టుగా నిద్ర లేస్తిని. 'ఇంకొక రెండు గంటల్లో జెడ్డాలో దిగతాము' అనింది సుల్తానా.

జెడ్డాలో దిగేటప్పటికి పొద్దు పదిబార లెత్తున ఉంది. అడ తూరుపో, పడమరో తెలియడంలేదు. 'పిచ్చిదానా, సాయంత్ర మేమో' అనింది తులసమ్మ. అడ గాజు పొడి జల్లించినట్టుగా ఎండ కురుస్తా ఉంది. నేలపైకి దిగితిమా, కాలే పెనములోకి దిగితిమా అనిపించింది. నీడపట్టు కోసరం పరుగు దీస్తిమి. 'ఇక్కడితో ప్రయాణం అయిపోలా. జడ్డా నుంచి రియాజ్ వెళ్లాల' అనింది సుల్తానా. మళ్లా ఇంకొక ఇమానం. అందులో పక్క కొరికేంతసేపు ప్రయాణం. అక్కడ్నుంచి అ దేందో ఏరు బస్సంట. అందులో కెక్కించిరి. అయితే కాసేపటికే దిగిపోతిమి. 'ఇప్పుడింక రావల్సిన చోటి కొచ్చేసినాం. దీని పేరు అల్ఘసమ్. ఇక్కడ్నుంచి మీకూ నాకు తెగతెంపులు. మీలో గూడా ఎవురి దారి వాళ్లదే' అని చెప్పేసింది సుల్తానా.

జమాజట్టీల మాదిరిగా, ఎర్రగా, సడగొండ లాయకట్టుగా కొందరు అసాములు అక్కడి కొచ్చినారు. ఒక్కొక్కరి చేతా ఒక పోటో, దాంతో మేము తీయించి పెట్టుకున్న పోటో పాటా ఏసి చూసి ఎవురెవురు ఎవుర్ని తీసుకపోయేది కేటాయించేసినారు. తీరా ఎవురి దోవ వాళ్లు చూసుకోవల్సి వచ్చేటప్పటికి, పోవడానికి కాళ్లు రాక తులసమ్మ నన్ను పట్టుకోని బావురుమని ఏడ్చేసింది. నేనూ ఎక్కిళ్లు పెడతా ఏడ్చేసినా. సుల్తానా మమ్మల్ని బలవంతంగా ఇడదీసి తీసుకపోయి ఒక్కొక్కర్ని ఒక్కొక్క కారులో కూచోబెట్టింది. అసామి వెనక సీట్లో కూచొన్నాడు. డ్రయివరు ముందుసీట్లో కొచ్చినాడు. నల్లటి తోలేసుకోని, వాడిన మొకం పెట్టుకోని అ డ్రయివరు గూడా ఏదో పరాయి దేశం నుంచే వచ్చినోడు మాదిరుండాడు. టీరింగు చక్రం దగ్గర కూచున్న డ్రయివరుగానీ, అదే సీట్లో ఇంకొక పక్కన కూచున్న నేను గానీ అ కారులోనే ఉండామని లెక్కపెట్టకుండా వెనుక సీట్లో అసామి మత్తు మగతలో జోగిపోతా ఉండాడు.

పొద్దుపోయింది. చీకటి పడింది. మన దేశంలోనైతే దీపాలు పెట్టేయేళ. వాళ్ల పుణ్ణానికి కిటికీ పూర్తిగా మూసెయ్యకుండా కొంచెం ఎలితి పెట్టినారు. చూసినంత దూరం ఇసిక పర్రలు. రాళ్లూ, రప్పలూ! అక్కడక్కడ అదొక రకం ఈత చెట్లు. అవి ఖజ్జూరం చెట్లని తరవాత్తరవాత తెలిసింది. మనసక సీకట్లో ఇసిక మైదానం మురికినీటి చెరువు మాదిరుంది. రాళ్లూ, గుండ్లూ లేని పరిగెత్తబోయే నల్ల జీవాల మాదిరుండాయి. ఖజ్జూరం చెట్లు తల ఇరబోసుకున్న దయ్యాల మాదిరుండాయి. చుట్టుపక్కల సడీ సప్పుడూ లేదు. కారు గూడా అలికిడి లేకుండా సున్నగా తార్రోడు మీద జారిపోతా ఉంది. చీకట్లు నల్లగా ఎలుగ్గొడ్ల అయకట్టు దూకతా ఉండాయి.

దిగులుతో నా మనసు నడుము ఇరిగిన జీవి మాదిరిగా మూలగతా ఉంది. పోయింది. ఏదో చేయిజారిపోయింది. ఏం దది? అవులే. తెలిసింది. ఉండూరు నుంచి కాలు దీసి రాగానే నేను అయినవాళ్ల నందర్నీ పోగొట్టుకొంటిని. రైలెక్కినప్పట్నుంచి ఈనాటిదాకా దిగులుపడినప్పుడంతా దయిర్నం చెప్తా వచ్చిన దోవతోడు రాయపాటి తులసమ్మక్కను పోగొట్టుకొంటిని. ఒంటిదాన్నిగా మిగిలిపోతిని. దేశం కాని ఈ దేశంలో నా కేముంది? ఎవురుండారు? తుమ్మినా, దగ్గినా, ఒళ్లు నొచ్చినా, జొరం వచ్చినా నా బాగు, ఓగూ ఎవురు గమనిస్తారు? డబ్బు కోసరం ఎటువంటి కనాకష్టపు పనికైనా తెగబడే మనిషని ఏ భగమంతుడు మాత్రం దయతలస్తాడు?

ఉన్నట్టుండి కా రొకచోట నిలిచిపోయింది. ఎవురో గేటు తీసినారు. కారు లోపలికి పోయింది. మళ్లా గేటు పడిపోయింది. డ్రయివరు కారు తలుపు తీసినాడు. నేను కిందికి దిగితిని. చుట్టుపక్కల ఇండ్లుండేదీ లేందీ కనిపించకుండా రెండు నిలువు లెత్తున పెద్ద పారి గోడలుండాయి.

నడిమద్దెన మహీడీ ఉంది. చుట్టూ ఇసికే. మన బందారు చెట్ల మాదిరిగా చిన్న చిన్న పొదలుండాయి. అ దొకటి, ఈ దొకటి ఖజ్జూరం చెట్లుండాయి. తల పైకెత్తితే ఆకాశం కనిపిస్తాది. జైలు జైలంటే ఏందో ఇంతకాలం తెలియలా. అప్పుడు తొలిసారిగా తెల్సింది. పక్కవాకిలి నుంచి బయటికొచ్చిన చెయ్యొకటి రమ్మన్నట్టు సైగ చేస్తా ఉంటే, మెట్లెక్కి లోపలి కడుగు బెట్టినా. అ అడామెకు నలభై యాభై ఏండ్లుండొచ్చు. ముసుగు లేదు. ఇంట్లో ముసుగేయరేమో, నా కప్పటిదాకా తెలియదు. షరాయీ, జుబ్బా మామూలే. అయమ్మనే నేను కొన్న బురఖా తీసేసింది. ఇద్దరమూ ఎదురెదురుగా నిలబడినాము. చెరిగిన తల, మాసిన గుడ్డలు, చేతికి మసి మరక, ఇదంతా చూస్తే అమె అ ఇంటి యజమానురాలు మాదిరి లేదు. అమె నా చెయ్యి పట్టుకుంది. లోపలికి తీసుకుపోయింది. అక్కడ హాల్లో టీ.వి. గొంతు చించుకుంటా ఉంది. పిల్లకాయలు ఈలలేస్తా, చేతులు తడతా నానా రబస చేస్తాఉండారు. గన్నేరు పువ్వు రంగుతో, కండలకు కొదవ లేకుండా బొద్దుగా, సున్నగా బంగారు నగలతో మినమినలాడిపోతా ఉంది ఇల్లాలు. అమె సుట్టూ అంతోళ్లు, ఇంతోళ్లు ఏడెనిమిదిమందిదాకా బిడ్డలు. వాళ్లందురూ నన్ను మిర్రిమిర్రి సూచినారు. నన్నక్కడికి తీసుకుపోయినామె అదేందో బానలో నన్ను సూపిస్తా ఏందేందో సెప్పింది. అ ఇంటి బాశాలి అన్ని మాటలకూ తలూపిందే గానీ, మాట మాత్రం పెదిమ మీదికి రానేలేదు. అ ఇంట్లో మొదట కనిపించిన అడామె ఎవురో గానీ, దేవత మన్షి మాదిరిగా నన్నాదరించింది. అమె మాటాడే బాన కొంచెం కొంచెం అరవం మాదిరిగా ఉంది.

మీరు పుట్టక మునుపు నేను, మీ నాయిన కూలి పన్ల కోసరం బెంగులూరు దాకా యళ్లొస్తిమిగదా! అప్పట్లో కొందురు అరవోళ్లు గూడా మాతో కలవడం వల్ల నాకున్నూ ఒకమాదిరిగా అరవం అర్థమవుతుంది. మన ఊళ్లో ఒక సందు సందంతా సాయిబులే గదా! వాళ్ల మూలంగా కొంచెం తురకాణం గూడా వచ్చు. అమాత్రం తురకాణం అమెకున్నూ వచ్చినట్టే ఉంది! ఎప్పుడు తినిందో ఏమోనని, అయమ్మ నన్ను తీసుకపోయి బ్రెడ్డో, గుడ్డో, పూరీయో, గిలీయో - కాలే కడుపుకు ఏదైతే నేమి, కడుపునిండా తిండి పెట్టింది. పనిమన్షుల కని ఇంటికి కొంచెం దూరంగా, పారీ గోడకు అనుకున్నట్టుగా రూమొకటి కట్టిపెట్టినారు. అ రాత్రి మే మిద్దురూ అ రూములోనే పడుకొంటిమి. నడిరేయి దాటేదాకా అమె ఎట్టెట్టనో తనకొచ్చిన ఉపాయాలన్నీ అమలుపెట్టి అ బానలో కొంచెం, ఈ బానలో కొంచెం, అ సైగతో కొంచెం, ఈ సైగతో కొంచెం, మొత్తానికి నాకు తెలిసేటట్టుగా చెప్పాల్సిన సంగతులన్నీ చెప్పేసింది.

అ ఇంటి కామందుకు చమురు బావుల అదాయం లచ్చల లెక్కలో వస్తాదంట. ముగ్గురు భార్యలు. బిడ్డలు ఇరవైమందికి తక్కువుండరు. భార్యలు ముగ్గురికీ వేరేవేరే ఇండ్లు. ఈ ఇంట్లో పనిమన్షిగా ఉండిన పాకిస్తా నామె వాళ్ల దేశం ఎళ్లిపోయి రెండు నెలలయిందంట. అందుకని ఇంకొక పనిమన్షి వచ్చేదాకా పని జరిగేదానికని ఒక బంధువులింట్లో నుంచి ఈమెను



## సినిమా పాటకు స్వతంత్రం

సాహిత్య రంగంలో మహర్షి ఆరుద్ర రెండు దశాబ్దాల కిందట సినిమా పాటల్లో బూతుల గురించి ఇలా అన్నారు :

"బూతు అర్థాలు, అశ్లీల పదాలు సినిమా పాటల్లో వస్తున్నాయన్న మాటను నేను కాదనను. అయితే ఇవాళ్టి సినిమాల్లో వస్తున్న పాత్రలూ, పాత్ర పోషణ బట్టే అ పాటల రచనా ఉంటుంది. సినిమా పాటకు ఎప్పుడూ స్వాతంత్ర్యం లేదు. పాత్రల స్థాయిని అనుసరించే సినిమా పాట రూపొందుతుంది. అ పాట ఎప్పుడూ ఒక పాత్ర మీదే ఆధారపడి ఉంటుంది. అ పాత్ర భావాలూ, ప్రవర్తనా పాడే పాటలో ప్రతిఫలిస్తాయి. క్లబ్‌లో అర్ధనగ్నంగా డాన్స్ చేసే నర్తకి అద్భుతమైన గీతాలు ఎలా పాడగలదు? శృంగార సన్నివేశంలో రచయిత శృంగార గీతాన్నే రాయాలి గానీ, భక్తి గీతం ఎలా రాస్తాడు?"

ఇరవైఏళ్ల క్రితం ఈ అభిప్రాయం బాగానే ఉంది కానీ, ప్రస్తుత చిత్ర గీతాల గురించి ఇలా ఆయన అనరేమో!

గీతా

## సంగతులు - సందర్భాలు - 29

# "నా దేశమంటే నీ కంత చులకనట్రా?"

అతడొక కళాశాల అధ్యాపకుడైన ఆంగ్లేయుడు. పేరు ఎఫ్.సి.ఓటెన్. అతడు భారతదేశాన్నీ ఈ దేశ ప్రజలనూ నీచంగా విమర్శిస్తూ క్లాసులో మాట్లాడేవాడు.

ఆ క్లాసులో విద్యార్థి సుభాష్ చంద్రబోస్ అతడు చేసే దూషణలు సహించలేక ఒకనాడు అందరూ చూస్తుండగా "నా దేశమంటే నీ కింత చులకనట్రా?" అంటూ సింహపు కొదమ వలె అతని మీదికి లంఘించి చెప్పు తీసుకుని ముఖం మీద ఎడాపెడా వాయించాడు.

ఆనాటి కలకత్తా విశ్వవిద్యాలయాధికారులు ఈ కారణాన సుభాష్ బాబును రెండేండ్లపాటు కాలేజీలో చదివే వీలు లేకుండా డీబార్ చేశారు.



కలకత్తాలో ప్రసిద్ధ న్యాయవాదిగా నున్న జానకీనాథ్ బోసుకు సుభాష్ బోసు ఆరవ కుమారుడు. 1897 జనవరి 23న జన్మించాడు. ప్రతి పరీక్షలోనూ అత్యున్నత శ్రేణిలో ప్యాసయేవాడు. తండ్రి పట్టుదల వలన ఇంగ్లండు వెళ్లి ఐ.సి.ఎస్. పరీక్ష ఇచ్చాడు. పరీక్షలో నాలుగవ ర్యాంకులో ఉత్తీర్ణుడైనప్పటికీ, ఆంగ్లేయులను కొలవడమా, భరతమాతను కొలవడమా అనే విషయంలో దేశ భక్తికే అగ్రస్థాన మిచ్చి, ఐ.సి.ఎస్. పదవికి ఇంగ్లండులో ఉండగానే రాజీనామా ఇచ్చి స్వదేశానికి మరలి వచ్చాడు.

'దేశబంధు' చిత్తరంజన్‌దాస్‌కు ప్రియశిష్యుడుగా రాజకీయరంగంలో అడుగుపెట్టిన సుభాష్‌బాబు భారత యువక హృదయ సామ్రాట్టుగా రాణించాడు. 1922లో బ్రిటిష్ సామ్రాజ్యంలో రెండవ మహానగరమైన కలకత్తాకు చిత్తరంజన్‌దాస్ మేయరుగాను, సుభాష్ బోసు చీఫ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిలర్‌గాను ఎన్నికైనారు. కార్పొరేషన్ ఉద్యోగులకు అధికార డ్రెస్‌గా ఖద్దరు ప్రవేశపెట్టబడింది.

సుభాష్ బోసు భారతీయుల నుద్దేశించి చేసిన ప్రసంగాలలో కొన్ని భావము లిలా ఉన్నాయి:

"ఈ అశాశ్వతమైన ప్రపంచంలో ప్రతిదీ మరణిస్తుంది, నశిస్తుంది. కానీ ఆశయాలు, ఆదర్శాలు నశించవు.

"ఒక వ్యక్తి ఒక ఆశయం కోసం మరణించవచ్చు. కాని అతని అనంతరం అదే ఆశయం కొన్ని వేల మంది మనస్సులలో ప్రవేశించి శాశ్వత రూపం దాలుస్తుంది. ఈ రీతిలో ఉత్తమ ఆకాంక్షలు ఒక తరం నుండి మరొక తరం వారికి అందజేయబడుతాయి.

"ప్రపంచంలో ఏ ఆదర్శమూ కూడా బాధలు, యాతనలు అనుభవించకుండా సాధించబడలేదు.

"ఒక సిద్ధాంతం కొరకు, ఒక ఆదర్శం కొరకు జీవించి మరణించటంలో ఆనందం ఇంకెందులో ఉన్నది?

"తన అనంతరం తన ఆత్మ అనేక మంది మనస్సులలో ప్రవేశించి వారిని ఉత్తేజపరచి తాను అసంపూర్తిగా వదలివేసిన పనిని వారి చేత చేయిస్తుందనే సంతృప్తికంటె మిన్నయైన సంతృప్తి ఎందులో ఉన్నది?

"బాధల నెదుర్కోవడం వలన త్యాగం చేయడం వలన ఎవడూ ఏమీ కోల్పోడు. భూమి మీద అతడేదైనా కోల్పోయినట్లయితే, నశించనటువంటి కీర్తికి అతడు వారసుడు కావడం ద్వారా పోగొట్టుకొనిన దానికంటె అధికంగా మరల పొందుతున్నాడు.

"జాతి జీవించడం కొరకు వ్యక్తి త్యాగం చేసి తీరాలి. మరణించి తీరాలి. ఈనాడు నేను మరణిస్తాను. అందుమూలాన భారతదేశం జీవిస్తుంది. స్వతంత్ర్యాన్ని ఘనతను పొందుతుంది."

సేకరణ: మన్నవ గిరిధరరావు

తీసుకొచ్చుకున్నారంట! ఇప్పుడు నే నొచ్చినాను కాబట్టి ఏ పని ఎట్టా చెయ్యాల్నో నేర్పించి, ఈమె నాలుగు దినాల్లో మళ్లీ తన పాతచోటికి తాను ఎళ్లిపోతుందంట! ఆ ఇంట్లో పనిమన్షి చెయ్యాల్సిన పన్లని గురించి ఆయమ్మ చెప్తా ఉంటే నా గుండె గుబేల్ గుబేల్మని కొట్టుకొనింది. రాత్రి పడుకోబొయ్యేదానికి మునుపే రేపు తెల్లారి ఎవురెవురు ఏయే టిపిను తినేది అడిగి తెల్సుకోవాల. ఒక బిడ్డ ఉడకబెట్టిన గుడ్లు, ఎముకల సూపు కావాలంటాది. ఇంకొక పిల్ల పూరీ, ఉర్లగడ్డ మసాలా అంటాది. ఒక పిల్లకాయ చపాతీ, చేపలకూర అంటాడు. ఇంకొకడు ఖజ్జూరం పండ్ల హల్వా చేసి పెట్టమంటారు.

తెల్లారుజామున నాలుగ్గంటలకంతా లేచి ఎవురెవురి కేది కావాల్నో అది చేసి పెట్టాల. టిపిన్ల నంత ముగిసేటప్పటికి ఎనిమి దవుతుంది. అప్పటి నుంచి ఫ్రిజ్జులో నిలవబెట్టిన రకరకాల మాంసాలతో కసరత్తు మొదలుపెట్టాల. నూనెల్తో, మసాలాతో, కత్తుల్తో, కటార్లతో బిర్యానీలు, పులావులూ, వేపుళ్లూ, ఆమ్లెట్లు, ఇంకా వాళ్లు కోరినవన్నీ బేసిన్లకు బేసిన్లే వండెయ్యాల. ఒంటిగంతా చేసినవన్నీ ఖాళీ చేసి ఎక్కడివాళ్లక్కడ సొమ్మసిల్లి పడిపోతే అప్పుడింక పనిమన్షి మాసిన బట్టలన్నీ తెచ్చి, బుజంగూటిలోనుంచి చేతులు ఊడిపోయేటట్టుగా చాకిరేవు పెట్టాల. మళ్లా సాయంత్రం అయిదు నుంచి వంటల తయ్యారీకి తలపడాల. రాత్రి కాను కానూ వీడియో ముండ రాకాసి మాదిరిగా గగ్గోలు పెడతాది. ఎవురూ ఒకపట్టాన భోజనానికి రారు. పనిమన్షి పడిగాపులు పడతా అగోరించాల. అందురూ తిని ఇల్లు మాటుమణిగేటప్పటికి గంట పదో, పదకొండో అవుతుంది. పనిమనిషి అయిదారుగంటలు పడుకోగలిగితే బమ్మాండం.

'థూ మాయదారి దేశాని కెందు కొస్తివి అమ్మీ! ఇక్కడ నీకు ఏడవడానికైనా టైముండదే' అని కన్నీళ్లు నాకు కనిపించకుండా ఆయమ్మ ముఖం అవతలికి తిప్పేసుకొనింది.

తాను చెప్పిన మేరకు ఆ ఇంట్లో నాలుగు రోజులుండి, పన్లు చేసే పయినమంతా నేర్పించి, ఎన్నో బుద్ధిమాటలు చెప్పి, ఆమె తన మామూలు చోటికి ఎళ్లిపోయింది. పొయ్యేదానికి ముందుగా నన్నొకమాట అడిగింది.

"మీవాళ్లేమో నిన్ను మరిచిపోరు. జాబులు రాస్తారు. ఏ డ్రయివరో, పనోడో పోస్టు పెట్టెలో నుంచి నీ కొచ్చిన జాబు తెచ్చి ఇంట్లో పడేస్తాడు. నీకేమో చదువు రాదు. జాబు చదువుకోలేవు. చదువుకోనే రాకపోతే ఇంక రాసే దెక్కడ? ఏం జేస్తావు?"

నేను చిక్కి బిక్కరించినాను. బదులు చెప్పలేక, ముందు గతేమో మనసుకు రాక తలను గోడకు పెట్టి - కొట్టుకోవాలనుకున్నాను.

"సరేనమ్మా! దేనికైనా ప్రాప్తముండాల. ప్రాప్తముంటే నువు మీ గడ్డకు పోతావు. లేకుంటే ఇక్కడ్నే ఉంటావు. ఇక్కడ్నే కండ్లు మూస్తావు. ఎవరి తలరాత ఎట్టా ఉండాదో? మనం కర్తలమా!" అన్జెప్పి ఆమె తనపాటుకు తాను సాగబారిపోయింది.


ఏం జెప్పుదునమ్మా! నా బతుకిట్లా రాళ్లవంక తెల్లారిపోయ. సీతమ్మవారికి అశోకవనం మాదిరిగా నా కిది పెద్ద చెరైపోయ. పగులంతా వంటింట్లోనే. అవేం మాంసం ముక్కలో, అవేం గరంమసాలో, అవేం నూనెలో, అది మన్షి తినే తిండి గాదు. వీళ్లెట్టా తింటారో, ఎట్టా అరిగించుకొంటారో ఆ పరమాత్ముడికే తెలియాల. ఆడవాళ్లు ఈగ వాలినా జారిపోయేంత నున్నగా, చెడమాగిన టమాటో పండ్లమాదిరి ఎర్రగా, గిచ్చితే నెత్తురొచ్చేటట్టుగా ఉంటారు. మగవాళ్లు మస్తుగా సంపాదించుకొస్తే, ఆడవాళ్లు అన్ని హంగుల్తోనూ వాళ్లకు ఖుషామత్తు చేస్తారు. వాళ్లకు వాళ్లే మన్షులు.

ఇతర దేశాల నుంచి పట్టుకొచ్చిన నాబోటివాండ్లని ఫ్రిజ్జు మాదిరిగా, మిక్సీ మాదిరిగా, వాషింగు మిషను మాదిరిగా, ఒక పనిముట్టుగా చూస్తారు. అందరికంటే ముందుగా నిద్ర లేవాల. అందరి కోసరమూ వంటలు చెయ్యాల. అందరూ తిన్నాక మిగిలిందేమైనా ఉంటే తినాల. అందరూ నిద్రపోయినాక పడుకోవాల. ఒక ఇరుగు లేదు, ఒక పొరుగు లేదు. నా కష్టం, నా నష్టం, నా దుక్కం, నా బాధ చెప్పుకోవాలంటే ఇనే దెవురు? దినాలు, వారాలు, నెలలూ దొర్లిపోతా ఉండాయి. ఈలోగా మీరు జాబులు రాసిందీ, లేందీ తెలియదు. ఇదిగో, ఈ జాబు నీ కొచ్చిందని చెప్పే దెవురు? వచ్చిందిబో, చదివి, ఇదిగోనమ్మా ఇదీ మీ వాళ్ల సంగతి - అని చెప్పే దెవురు? ఇంక నే నింతేనేమో! మీరంతేనేమో! మీకూ నాకూ ఇంక చూపుల్లేవేమో. మనం ఎదురెదురుగా కూర్చుని మాట్లాడుకోవడం కుదరదేమో. కండ్లలో మెదిలే నా బిడ్డల్ని ఇంక నేను కలల్లో మాత్రమే చూచుకోగల్నేమో. పూర్వ జల్మలో ఏ ఆలూ మొగుళ్లకు ఎడబాటు చేస్తినో, ఏ పసికందుల్ని ఆకలితో మాడిస్తినో, ఏ పచ్చి కొమ్మల్ని ఇరిచేస్తినో

ఈ జల్మకు భగమంతుడు నన్నిట్లా. చిన్నచూపు చూసినాడు. కాకపోతే కట్టుకున్న మొగుణ్ణి వొదిలిపెట్టి, కన్నబిడ్డల్ని వొదిలిపెట్టి, ఉండూరొదిలిపెట్టి, అయినోళ్ల నందర్నీ వొదిలిపెట్టి, ఈ ఎండలు మండే చోటికి, ఈ చెట్లు మొలవని చోటికి, ఈ మంచినీళ్లు దొరకనిచోటికి, మన మాట వినవడని చోటికి నే నిట్లా కొట్టుకొస్తానా?

ఇట్లా నేను పరివరి విధాలుగా కుమిలిపోతా ఉండగా, ఒక దినం మధ్యాన్నం ఆ ఇంటి పిల్ల ఒకతె పరుగెత్తుకుంటా వచ్చి నా చెయ్యి పట్టుకొని 'నీకు ఫోను, నీకు ఫోను' అంటా పక్క రూములోకి లాక్కొనిపోయింది. ఇదేం మాయరా దేముడా అని రిసీవరెత్తి చెవి దగ్గర పెట్టుకొంటి.

కడుపులో. పాలు బోసినట్టుగా చెవుల్లో పెండ్లి మేళం మోగినట్టుగా నిండా ఏడాది గడిచిన తర్వాత మన మాట ఇనిపించింది.




"హలో! అమ్మీ నాగమనీ!"

పేరుపెట్టి పిలిచే దెవరబ్బా అని తబ్బిబ్బు పడిపోతే ఉండా. నోట మాట రాలా!

"నేనమ్మా! మీ పులిచెర్ల రంగన్నని" అనేటవ్వటికీ, "అన్నా! నువ్వా!" అని బిత్తరపోతిని. ఎట్లనో మాట ఊడిపడిపోయ.

"నేనే. తెలుసుగదా. నే నుండేది గూడా ఈ దేశంలోనే. నువ్వుండే చోటికి దగ్గరే. అంతా నూరు కిలోమీటర్లుండొచ్చు. ఆల్‌బుఖారియా అంటారు. ఇక్కడ డ్రైలరుగా ఉండాలే. ఇవ్వుడు షాపులో నుంచే మాటాడతా ఉండా. కల్లూరు నుంచి మీ ఇంటాయన నా పేరిటికి జాబు రాసినాడు. నీకేమో అయిదారు జాబులు రాయించినాడంట. బదుల్లేదంట. తన జాబు నీకు చేరిందీ, లేందీ తెలియలేదంట ..."

చుట్టుపక్కల ఎవురూ లేకపోవడం గమనిస్తిని. నిండిన చెరువులో తూము తెరిచేసినట్టుగా ఏడుపొచ్చేసింది. ఎలుగెత్తి ఏడ్చేసినా.

"పిచ్చిమొగమా! ఏడవబాక! ఫోను పైన శానాసేపు మాటాడే వీల్లేదు. జాగరత్తగా ఇను! ఒకవేళ జాబు చేరినా, చదువుకోలేవు. అక్కడ మన బాస తెలినో ళ్లెవురూ ఉండరు. అందువల్ల నువ్వొక పని చెయ్!" అనినాడు.

"చెప్పన్నా! చెప్పు!" అని గింజుకుంటిని.

"వారం రోజుల్లో నేను నీ కొక సంచి పోస్టులో పంపిస్తా. అందులో కల్లూ రడ్రస్సు రాసి, స్టాంపు లంటించిన ఇంకొక సంచీ, దాంతో గూడా ఒక ఖాళీ క్యాసెట్టూ ఉంటాయి. మీ ఇంటిగల్లామె నడిగి టేప్ రికార్డరు తీసుకో! అందురూ నిద్రపోయాక నువు నీ రూములో కూచోని అందులో ఈ క్యాసెట్టు పెట్టు. ఏ మర నొక్కితే టేపు తిరుగుతుందో ఆ మర నొక్కు. ఆ పైన మాటాడు. టేపు నీ మాటల్ని పట్టేస్తుంది. ఆ క్యాసెట్టును నేను స్టాంపు లంటించి పంపే లోపలి సంచీలో పెట్టి, సుబ్బరంగా నాలుగో వైపు కూడా కుట్టేసి, ఎవురిచేతనైనా అది తపాలా పెట్టెలో పడేటట్టు చూడు. క్యాసెట్టు పదిరోజుల్లో ఇండియాలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, చిత్తూరు జిల్లాలో, పులిచెర్ల మండలంలో, కల్లూరు గ్రామానికి పోయి, నేరుగా మీ ఇంటాయన చేతిలో వాలిపోతుంది. నీ భర్త, నీ బిడ్డలు, ఇంకా నీ కయినోళ్లు అందురూ చుట్టూ కూచోని టేప్ రికార్డర్‌లో దాన్ని పెట్టి, బిన నొక్కి నీ మాటల్ని ఇంటారు. ఇట్లనే వాళ్లు గూడా నీ కొక క్యాసెట్టు రికార్డు చేసి తపాల్లోనే పంపిస్తారు. ఏ మమ్మీ! తెలిసిందా? సందేహ మేమైనా ఉందా నాగమనీ!" అని అడిగినాడు మా పులిచెర్ల రంగన్న.

"నీకు పున్నెముంటుందన్నా! పంపించు, తప్పకుండా పంపించు!" అంటిని.

ఆయన బిడ్డ పాపలు చల్లగుండాల. ఆయన ఇల్లు పదిండ్లు కావాల. మా పులిచెర్ల రంగన్న దేవుడు మాదిరిగా నన్నాదుకొనినాడు. వారం దినాల్లోనే క్యాసెట్టొచ్చేసింది. ఇవ్వుడు రాత్రి గంట పన్నెండయింది. అందురూ నిద్రపోతా ఉండారు. నేను నా కిచ్చిన రూములో అడుగు పెట్టినా, తలుపు మూసి గెడ పెట్టినా. టేప్ రికార్డరులో మర నొక్కినా. గొంతు ఇప్పినా. మాటాడతా ఉండా! అనసూయా, ఇంటా ఉండావా? అలిమేలూ, నా గొంతు నా గొంతు మాదిరిగానే ఇనిపిస్తాఉందా? ఒరే నత్తిబాబూ! గొంతెత్తి ఏడస్తావుండావట్రా పిచ్చినాయనా! అసలే మెతక మనిషి మీ నాయిన. కన్నీళ్లు తుడుచుకుంటా కడప దాటి అరుగుపైకి ఎళ్లిపోయినాడేమో! అనసూయా! నువు పైటలో మొకం దాచుకొని ఎక్కెక్కి ఏడస్తావుండావేమో! అలిమేలూ కూచోలేక సాపుగా నేలపైకి వాలిపోయిందేమో! భార్యగా భర్తనీ, తల్లిగా బిడ్డల్ని ఇంతగా కష్టపెట్టిన నాకు పుట్టుగతు లుంటాయా!

అనసూయా! అలిమేలు చిన్నపిల్ల. అన్నెం పున్నెం తెలియదు. దానికి అక్కవైనా నువ్వే, తల్లివైనా నువ్వే! పసివాడు నత్తిబాబును తల్చుకుంటే నాకు తిండి దిగదు. నిద్ర పట్టదు. ఏదైనా కావాలంటే వాడు పొర్లి పొర్లి ఏడస్తాడు. నా మీద ఒట్టే! వాణ్ణి కొట్టొద్దు. అమ్మణ్ణీ! అలిమేలూ! నువు అక్క జెప్పినట్టుగా ఇనుకోవాల. తమ్ముణ్ణి ముద్దుగా చూసుకోవాల. నా బంగారు తండ్రీ నత్తిబాబూ! నువు స్కూలు కెళ్లకుండా ఉండొద్దు. బాగా చదువుకో. సమ్మత్సరానికో, రెండు సమ్మత్సరాలకో నేను తిరిగొచ్చేటప్పుడు మీ కందరికీ పెట్టె నిండుకూ డ్రెస్సులు తెస్తా. అనసూయా! మీ రింక నాకు జాబులు రాయొద్దు. ఇట్లనే మీరు కూడా ఒక క్యాసెట్టు తెప్పించి మీ మాటలు టేపు చేయించి పంపించండి. నా కెన్నెన్నో సంగతులు తెలుసుకోవాలని ఉంది. మిద్దింటి చెంగమ్మ కొడుకు వాళ్ల నాయిన కొట్టినాడని నే నిట్లా వచ్చేటప్పటికి ఊరొదిలిపెట్టి పరారైపోయివుండె. ఆ అబ్బోడు తిరిగొచ్చినాడా, లేదా? మూడో ఇంట్లో కమలమ్మత్త కోడలు నవమాసాల గర్భిణిగా ఉండె. నే నొచ్చేసిన కొత్తలోనే నీళ్లాడి ఉంటుంది. ఏం బిడ్డ? మగబిడ్డా, ఆడబిడ్డా? నిరుడు వానాకాలంలో వాన లొచ్చి ఏటిలో కొత్తనీళ్లొచ్చినప్పుడు మన ఇల్లు సెమ్మెక్కి ఉండాల. అప్పుడు మీ రెక్కడ పడుకొంటిరి? కొత్త సులక దెచ్చి మంచా లల్లుకొంటిరా, లేదా? మన ఇంటెనక ఒక కరేపాకు చెట్టు నాటి వస్తిని. అది ఎంతెత్తు పెరిగింది? పావం, లేత చెట్టు. ఇవ్వుడివ్వుడే దాన్లో ఆకు కొయ్యొద్దు. తల్లీ, అనసూయా! ఇంకొక ముఖ్యమైన మాట చెప్పాల నీతో!

మీ నాయిన చూపుల కట్లా బింకంగా ఉంటాడు గానీ, మనసులో పసిబిడ్డే! ఆకలి కాలేదంటాడు. ఒకటికి రెండుసార్లు పిలిచి అన్నం పెట్టాల. ఈ రోజు స్తాన మొద్దులే అంటాడు. నీళ్లు తోడేసి పోసుకోమనాల. ఆయనకు ఎండాకాల మొస్తే పప్పూ చింతాకు పుల్లకూరంటే ఇష్టం. పండగ నెలొస్తే, ఆనపగింజల తియగూరంటే ఇష్టం. వానాకాలమొస్తే పుట్టపూత కూరంటే ఇష్టం. ఆయన తన కిది ఇష్టమని చెప్పడు. అయినా నువు చేసి పెట్టాల. ఆయన్ను గూడా ఒక బిడ్డగానే చూసుకోవాల. ఏమమ్మా, తెలిసింది గదా! మీ పులిచెర్ల మామ మళ్లా ఈ మధ్య ఒకసారి ఫోను చేసి చెప్పినాడు. ఉగాది పండగకంతా ఈ క్యాసెట్టు మీ చేతిలో ఉంటుందంట! ఉగాదికి మీకు వేప్పూత దొరుకుతుంది. కొత్త బెల్లం దొరుకుతుంది. మామిడి పిందెలు, చెరుకు ముక్కలు దొరుకుతాయి. మల్లెపూలు దొరుకుతాయి. పాపిష్టిదాన్ని నా కిక్క డేమీ దొరకవు. మళ్లీ మీ మద్దెకొచ్చి పడిపోతానే నా కుగాది. ఎప్పుడొస్తుందో నాకుగాది? ఎప్పుడొస్తుందో నాకుగాది?

★